# ప్రియతమా! నీ ప్రేమ ఇంతేనా?

ఓ తెలివైన అమ్మాయికి అకస్మాత్తుగా ముగ్ధంగా వుండే అందమైన మొద్దబ్బాయి కలసి, ఆమె మనస్సును దోచుకొని. అంతే కాకుండా మదిలో ఉప్పొంగే లావా వంటి కల్లోలానికి శరీరంలో జరిగే రసాయన మార్పులు తోడైనప్పుడు అవి గొప్ప గొప్ప మేధావుల ఊహాలకందని కెమిస్ట్రీలుగా మిగిలిపోయాయి. కొంతమంది దానిని 'తొలివలపు' అన్నారు. మరికొంత మంది 'పహలే మొహబ్బత్' అన్నారు. ఇప్పుడు ఫ్యాషన్‌గా 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటున్నారు. ఎవరు ఏమన్నా ప్రేమ మాత్రం ఉప్పొంగే కెరటం! శరీరంలో కరెంటు ప్రవహించి నరనరాలను ఉత్తేజ పరిచి హృదయాన్ని అల్లకల్లోలం చేస్తుంది.

ఈ భౌతిక రసాయనిక చర్యే యోగిత, రోహిత్‌ల మధ్య జరిగింది. నాలుగు సంవత్సరాలు గడిచినా అతడు ఆ ప్రేమను గుర్తించలేదు. వాళ్ళిద్దరూ క్లాస్‌మేట్స్ కంప్యూటర్ ఇంజనీరింగ్ కోర్సులో చేరిన మొదటిరోజే అతన్ని చూడగానే ఆమె హృదయంలో అతని రూపం ఇన్‌పుట్ అయ్యింది. రోజులు గడిచేకొద్దీ అతని ఊహాల ప్రోగ్రామ్‌లతో నిండిపోయి దిన దిన వర్ధమానంగా అతని లవ్ లాంగ్వేజ్‌లతో నిండిపోయింది.

యోగితవి పెద్ద కళ్ళు. చురుకైన చూపులు. నాజూకైన శరీరం... తెల్లగా... పాలరాతి శిల్పంలా వుంటుందామె.

ఆమె అందానికి ముగ్ధులై ఎంతోమంది అబ్బాయిలు ఆమెను ఆకర్షించాలని చూసినా బుద్ధావతారం లాంటి అందమైన రోహిత్ ఆమెకు బాగా నచ్చాడు.

తన ఆరాధన నంతా కనులలో నింపుకొని 'హలో!' అని నిశ్శబ్దంగా అతని వైపు చూసేది. ఆమె కనులలో దాగి వున్న ప్రేమను అతను గుర్తుపట్టేవాడు కాదు.

ఆమె ప్రయత్నం కొద్దిగా ఫలించి... సంవత్సరం తిరిగేసరికి ఆమె అతన్ని మాటలలోకి దించింది.

ఆ తర్వాత ఆటోమేటిక్‌గా బెస్ట్ ఫ్రెండ్స్ అయ్యారు. రోహిత్ దానిని స్నేహం అనుకునేవాడు. కాని, యోగిత మాత్రం అతనిని గాఢంగా ప్రేమిస్తోంది... 'త్వరలో ఫైనల్ ఎగ్జామ్స్ వున్నాయి. అవి అయిపోతే తాము రెగ్యులర్‌గా కలుసుకోకపోవచ్చు. త్వరలోనే అతనికి చెప్పెయ్యాలి? లేకపోతే ఎన్నో యేళ్ళుగా అతనిపై పెంచుకుంటున్న అనురాగం ఆమెలోనే సమాధి అవుతుంది కాబట్టి ఈ రోజు ఎలాగైనా చెప్పెయ్యాలి' అనుకుంది.

ఆమె ఆలోచనలకు ఆనకట్ట వేస్తూ.. 'యోగిత! క్లాసు అయిపోయి పది నిమిషాలయ్యింది!' అన్నాడు రోహిత్.

'రోహిత్ నీతో మాట్లాడాలి. హోటల్‌కు వెళ్దాం!'

'ఓ.కె.! వెడదాం!' అని పైకి అన్నాడు కాని అతని మనసులో ఎన్నో ఆలోచనలు... కొంపతీసి నిన్ను ప్రేమిస్తున్నాను! అని, అనకుండా చూడు భగవంతుడా!' అనుకున్నాడు.

పది నిమిషాల్లో వాళ్ళిద్దరూ హోటల్ గోల్కొండలో కార్నర్ సీటులో కూర్చొని వున్నారు.

కాలం నిశ్శబ్దంగా కరిగిపోతుంది. యోగితకు అసలు ఎలా మొదలు పెట్టాలో అర్థం కావట్లేదు. మనసు నిండా అతడు ఒప్పుకుంటాడో అర్థం కావట్లేదు. మనసు నిండా అతడు ఒప్పుకుంటాడో... ఒప్పుకోడో అన్న ఆలోచనలే... చివరకు ఎలాగో గొంతు పెగుల్చుకొని 'రోహిత్! నిన్ను చూసిన క్షణం నుంచే నా మనస్సు నాకు దూరం అయ్యింది. రోజులు గడుస్తున్న కొద్దీ నా మనసు నీ చుట్టూ తిరుగుతుంది. నా ప్రతి ఊహ..ప్రతి ఆలోచనా..నీ గురించే.. ఇది ఒట్టి ఆకర్షణే! అని తీసి పారెయ్యకు! ఇది ఇప్పటిది కాదు! నాలుగు సంవత్సరాలుగా నాలో పేరుకుపోయివున్న ఆరాధనా.... అనురాగం...ఆప్యాయత... ఒక్క మాటలో చెప్పాలంటే ఐ లవ్యూ!"

అంతవరకు తలొంచుకు కూర్చున్న రోహిత్ హఠాత్తుగా తలెత్తి 'యోగిత! చాలా ఆలస్యంగా చెప్పావు! ఈ విషయం ఇన్ని రోజులు నీలో ఎలా దాచుకున్నావు? పోయిన సారి సెలవులకు ఇంటికి వెళ్ళినప్పుడు నా ఎంగేజ్‌మెంట్ అయిపోయింది. ఫ్రెండ్స్ అందరిని సర్‌ప్రైజ్ చేద్దామని ఎవ్వరికి చెప్పలేదు. నా ఫియాన్సీని నా అంతట నేను అడిగి చేసుకుంటున్నాను. ఆ అమ్మాయి మదిలో ఆశలు కల్పించి... ఊహాలు రేపి మధ్యలో త్రుంచి వేయడం న్యాయమా! సారి ఫ్రెండ్! చాలా ఆలస్యంగా చెప్పావ్!' అని గబగబా వెళ్ళిపోయాడు.

రోజులు గడుస్తున్నాయ్! నిర్వేదంగా.. నిరాసక్తంగా వున్న యోగితను చూసి... 'నవ్వుతూ... తుళ్ళుతూ.. అందరిని ఏడిపిస్తూ... తన వెంట పడి మరి మరి పలకరించే అప్పటి అల్లరి అమ్మాయేనా ఈమె...' అని అనుకునేవాడు. ఆమె ఆలోచనలను ప్రక్కకు నెట్టినా తిరిగి తిరిగి వస్తూనే వున్నాయి. బలవంతంగా వాటిని ప్రక్కకు నెట్టి సీరియస్‌గా ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ కాసాగాడు.

పరీక్షలయిపోయాయ్! తన పెళ్ళికి రమ్మని అందరినీ ఇన్‌వైట్ చేస్తున్నాడు.

రోహిత్ తన వెడ్డింగ్ కార్డు తీసి ఆమెకిచ్చాడు.

దాన్ని అందుకొని...ప్రపంచంలోని దిగులు నంతా అప్పు తెచ్చుకున్నట్లు... విరక్తిగా నవ్వి... ఓ లెటర్ అతనికి ఇచ్చింది.

అతను ఆశ్చర్యంగా ఆ లెటర్‌ను తీసుకొని జేబులో పెట్టుకొని 'తప్పకుండారా యోగిత!' అన్నాడు.

'బ్రతికుంటే చూద్దాం!' ఎంత బిగపట్టినా ఆగకుండా ఆమె కళ్ళలో కన్నీళ్ళు...

'నీవు బ్రతికుండాలనే నా కోరిక! ఇంకా చాలా మందికి కార్డ్స్ ఇవ్వాలి! వస్తాను!' అని ఆమె సమాధానం కోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు.

తాత్కాలికంగా రోహిత్... యోగిత ఇచ్చిన లెటర్ గురించి మర్చిపోయాడు. తిరిగి... తిరిగి... ఇంటికి వచ్చి తాళం చెవి కోసం జేబులో చెయ్యి పెట్టేసరికి ఆమె ఇచ్చిన లెటర్ గుర్తొచ్చింది.

తీసి చదివాడు.

'ప్రియతమా!

# ఆఖరి లేఖ



నీ మనస్సు నా ప్రేమను స్వీకరించని క్షణమే నేను రంగులు లేని ఇంద్రధనస్సును అయ్యాను.

నా మనస్సులో ఎగిసిపడుతున్న ప్రేమ కెరటాలు నిను చేరలేక పోయాయి.

'నిన్ను నేను ఎలా అర్థం చేసుకోనూ...' అనుకుంటున్నావేమో...

నీవు ఏమైనా అను...

ఈ...బాధ.... వియోగాలను భరించడం ఇక నా వల్ల కాదు.

నా జీవితంలోని అనుభూతినంతా మధురమైన ప్రేమగా మలిచి నీకు అర్పించాను.

నీవులేని ఈ జీవితాన్ని అనుభవించడం నావల్ల కాదు... నీ జ్ఞాపకాలు ఓ చితిలా నన్ను నిరంతరం కాలుస్తున్నాయి. నీవు లేకుంటే చచ్చిపోయేలా వున్నాను.

నీతో మాట్లాడాలనే ఆరాటం... నీకు సమీపంగా వుండాలనుకోవటం...నీవు పలకరిస్తే చాలని.... నీ దగ్గరే నా జీవితమంతా గడవాలని... నా ఆరాధనా...ఆలోచనా... ప్రేమా అంతా నీవే... ఎన్నెన్ని జన్మలైనా మరువలేను.

నా జీవితంలో నీ రాక సంతోషాన్ని... నీ వియోగం అనంత ఋప్తిని కలిగించింది. నీవు లేని ఈ ప్రపంచం నాకు ఏ విధంగా కూడా ఆనందాన్ని ఇవ్వలేదు. అసలు భావమే లేదు. ఇంతగా ప్రేమించే నేను కొన్ని కోరుకోవటం తప్పా?'

నేను కన్న కలలను నిర్దాక్షిణ్యంగా చెల్లాచెదురు చేసి వెళ్ళిపోయావు! నీ జ్ఞాపకాలను అధిగమించటం నా వల్ల కాదు.

అయినా నీకు తెలుసా!

నా మనసా... వాచా...కర్మణా.. ఇంకా చెప్పాలంటే ఈ ప్రపంచంలో నా తల్లి కంటే ఎక్కువగా నిన్ను ప్రేమించానని.

అందుకే...నీ జ్ఞాపకాల చెరలో బందీ అయిన నాలోని ఘర్షణను ఘనీభవింపచేయాలంటే ఒక్కటే పరిష్కారం... నీ స్మృతులను మూటగట్టుకొని అమావాస్య నిశిలా ఈ ప్రపంచం నుండి నిష్క్రమిస్తాను.

'నీ ప్రేమను పొందలేక...నీవు లేక ఈ జీవితంలో అంతులేని దూరాన్ని వెళ్ళలేక ఈ లోకాన్ని విడిచి వెళ్తున్న అమాయక ప్రాణికి.. సాయంకాలం గూటికి వెళుతున్న పక్షికి అస్తమిస్తున్న భాస్కరుడిలా నైనా..వీడ్కోలు చెప్తావు కదూ!'

ఈ రోజు రాత్రి పది గంటలవరకు నీకోసం ఎదురు చూస్తాను! నీవు రాకుంటే...మరో జన్మలోనైనా నీకు మాత్రమే భార్య నవ్వాలని... మా ఇంటి వెనుక వున్న బావిలో దూకి... దేవుడి దగ్గరకు వెళ్ళి... నా ప్రేమకు న్యాయమేమిటని అడుగుతాను.

ఇక సెలవ్!<br>
నీకు ఏమీ కాని<br>
ఓ అభాగ్యురాలు<br>
యోగిత

ఆ లెటర్ చదవగానే అతని మనసంతా మొద్దుబారిపోయింది. వెహికల్ ఆక్సిలేటర్ గట్టిగా నొక్కి ఆమె ఇంటికి కొద్ది దూరంలో ఆగాడు. టెన్షన్‌గా చేతి గడియారం వంక చూసుకున్నాడు. ఆమె ఇచ్చిన టైమ్ కంటే అరగంట ఎక్కువైంది. అతనిలో భయం మరీ ఎక్కువైంది. ఇంటి వెనుక వైపు వెళ్ళాడు. కాంపౌండు వాలు పట్టుకొని లోపలికి తొంగి చూసాడు.

అక్కడ అస్పష్టంగా ఓ ఆకారం కనిపించింది. విపరీతమైన టెన్షన్‌తో 'యోగిత' అని గట్టిగా అరిచాడు రోహిత్.

ఆ కేక అతని గొంతులోనుండి బయటకు వస్తున్నప్పుడే బావిలో డబ్‌మని పెద్దగా శబ్దం

అయ్యింది.

ఓ క్షణం తర్వాత ఇంట్లో లైట్లు వెలిగాయ్. అందరూ భయంగా బావిలోకి చూస్తున్నారు. రోహిత్ తననెవరైనా గమనిస్తారేమో అని గబ గబా తన బండి స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత... అతనికి ప్రతి వస్తువులోనూ యోగిత రూపమే కనిపిస్తుంది. ఓ అందమైన అల్లరి అమ్మాయి తన గురించి ప్రాణం త్యాగం చేయడాన్ని అతని హృదయం భరించలేక పోతుంది. ప్రతిక్షణం వేధించే ఆమె ఆలోచనల నుండి బయటపడలేక మర్నాడే ఊరికి ప్రయాణమయ్యాడు.

మరో నెల రోజుల్లో అతని పెళ్ళి జరిగి పోయింది. స్నేహితులు అందరూ వచ్చారు. తన బెస్ట్ ఫ్రెండ్ సిద్ధు వెళ్ళిపోయేటప్పుడు మాత్రం వుండబట్టలేక అడిగాడు 'యోగిత ఎందుకు రాలేదని...'

'అరే! రోహిత్! నీకు తెలియదు! ఎప్పుడు నవ్వుతూ... అల్లరిచేసే కాలేజి బ్యూటీ యోగిత లవ్‌లో ఫెయిల్ కేనట! భరించలేక బావిలో దూకిందట!'

తన స్నేహితుడు చెప్పిన మాటలు విన్నాక రోహిత్ మనోవ్యథ మరింత ఎక్కువైంది.

'క్రొత్త పెళ్ళి కొడుకు ఇంత దిగులుగా వుంటాడా! పెళ్ళయితే మీ స్వాతంత్ర్యాన్ని కోల్పోతారనేగా! మీ స్వంత విషయాలలో నేనేం జోక్యం చేసుకోనులేండి' అంది అతని భార్య శిల్ప.

'ఛ! ఛ! దిగులా! అదేం లేదు!' అన్నాడు నీళ్ళు నములుతూ...

క్రమక్రమంగా యోగిత ఆలోచనలను ప్రక్కకు నెడుతూ శిల్పతో హాయిగా జీవించ సాగాడు.

కాల భ్రమణంలో ఓ ఐదేళ్ళు గడిచి పోయాయి.

రోహిత్ యోగితను మరచిపోతున్నా ఆమె తనవల్లె చనిపోయిందన్న భావనను మరచి పోలేదు. ఏ అర్థరాత్రో హఠాత్తుగా మెలుకువ వచ్చినప్పుడు ఆమె జ్ఞాపకాలు అతనికి చుట్టుముట్టెవి.

ఆ రోజు భార్యతో సహా తిరుపతికి వెడుతున్నాడు. విజయవాడలో ట్రైన్ ఆగినప్పుడు మంచి నీళ్ళకోసం క్రిందకు దిగాడు.

నీళ్ళు నింపుకొని ట్రైన్ ఎక్కబోతూ ప్రక్క కంపార్ట్‌మెంట్‌లోకి చూసాడు.

అతని కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.

'సందేహం లేదు! ఆమె యోగితనే...'

అతని మనస్సు సంతోషంతో వుక్కిరి బిక్కిరి అయ్యింది.

'యోగితా!' అని పిలిచాడు సంతోషంగా... ఈ ప్రపంచంలో లేదు. ఇక రాదు అన్న వస్తువేదో దొరికినంతగా సంతోషపడ్డాడు.

అతని పిలుపుకు ఆమె తల వెనక్కి తిప్పి చూసింది. ఓ క్షణం తర్వాత ట్రైన్ దిగి వచ్చి 'బాగున్నావా రోహిత్' అంది మామూలుగా.... ఏ భావం లేకుండా.

'ఆ.... ఆ..... నువ్వు బాగున్నావా? ఎన్ని రోజులకు కలిసాం! లెటర్‌లో వ్రాసినంత పని నిజంగానే చేశావా? బావిలో....' అతనికి చాలా ఆశ్చర్యంగా వుంది. ఆమె ఎలా బ్రతికి వుందోనని...

'అవును! రోహిత్! తలుచుకుంటే ఇప్పుడు నవ్వొస్తుంది. చిన్నప్పుడు ప్రేమకోసం ఎంత సిల్లీగా ప్రవర్తించాను కదూ! నీకు రాసినట్టే ఇంట్లో వాళ్ళకు కూడా లెటర్ రాశాను! కాని, మీకు లెటర్‌లో రాసినట్టుగా చచ్చిపోలేదు. బావిలో పెద్ద బండను పడేసాను! ఆ శబ్దానికి ఇంట్లో వాళ్ళు వచ్చి చూడటం... బావి గోడపై నేను వుంచిన లెటర్ చదవడం... ఏడుపులు...బావిలో వెదికించడం...ఇహా.... ఒకటే గోల... చెట్టుపై నుండి చూస్తున్న నాకు ఆ తతంగమంతా చాలా థ్రిల్‌గా అనిపించింది.

'ఆరు నెలల్లో నా పెళ్ళి జరిగింది. మరో మూడేళ్ళలో ఇద్దరు పిల్లలు పుట్టారు. మా శ్రీవారు చాలా మంచివారు. పెద్ద ఉద్యోగమే చేస్తున్నారు. హాండ్‌సమ్‌గా వుంటారు. మరి నీ శ్రీమతిని పరిచయం చేయవా?'

'ఓ తప్పకుండా! మీ శ్రీవారు రాలేదా!'

'లేదు! నేనొక్కదాన్నే... అమ్మ వాళ్ళింటికి వెడుతున్నాను.'

రోహిత్ తన భార్య శిల్పను యోగితకు పరిచయం చేసాడు. మరో రెండు నిమిషాల్లో వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు అయ్యారు.

రైలు బయలుదేరబోతున్నట్లుగా కూత కూసింది.

'రోహిత్! ట్రైన్ ప్రయాణం బోర్‌గా వుంది. నేను, నీ శ్రీమతి మాట్లాడుతూ... ఇక్కడ కూర్చుంటాం! నీవు నా సీట్లో కూర్చో' అని తన టిక్కెట్టు అతని చేతిలో పెట్టింది.

భారంగా అడుగులు వేస్తూ ప్రక్క కంపార్ట్‌మెంట్ ఎక్కి కూర్చున్నాడు రోహిత్.

రైలు వేగాన్ని అందుకొంది.

మళ్ళీ... అతని ఆలోచనలలో ఆమె...

'ఇంతేనా ప్రేమంటే? నీవే నా ప్రపంచమని.. నీవు లేకుంటే బ్రతుకలేనని... అణువణువున భావుకత్వం... ప్రేమా... ఆరాధనా... ఒలికించిన యోగితేనా ఇలా మాట్లాడేది!'

'ఈమెకోసమేనా తను ఇన్నాళ్ళు బాధపడింది? తన కోసం ఏమైనా...చివరకు ప్రాణమైనా ఇవ్వడానికి సిద్ధపడిన యోగిత ఇలా మాట్లాడుతుందేం? ఇన్ని సంవత్సరాల తర్వాత కనిపిస్తే అంటీ ముట్టనట్లుగా... మనుష్యులు ఇంత తొందరగా మారిపోతారా?'

'ఐ లవ్యూ!' అని ఆమె వెంటపడిన విధానం. ఉత్తరాలూ... నీవు లేనిదే భావమే లేదు ప్రియతమా! అన్న యోగిత...'

'అయినా ఆమె చనిపోకూడదనే...సుఖంగా వుండాలనే కదూ తను ఇన్నాళ్ళు కోరుకుంది. ఇంత సిల్లీగా ఆలోచిస్తున్నాడెందుకు? యోగిత తెలివికలది..అందుకే తన జీవితాన్ని సుఖంగా మలుచుకుంది. తన సుఖమే కదా నేను కోరుకుంది... అంతే... అంతేగా.... తనకు కావాల్సింది' అనుకున్నాడు.

ఇప్పుడు అతని మనస్సు తేలిగ్గా... హాయిగా వుంది.

## నదీమ్— శ్రవణ్లు రుణం తీర్చుకుంటున్నారు



నదీమ్— శ్రవణ్ సినిమా పరిశ్రమలో నిలబడాలని ప్రయత్నిస్తోన్న సమయంలో మిథున్ చక్రవర్తి వాళ్ళకి తన సహాయ సహకారాలు అందించాడు. తను నటించే చిత్రాల్లో నదీమ్— శ్రవణ్ల సంగీతం వుండాలని డిమాండ్ చేశాడు. మిథున్ చక్రవర్తి నటించిన 'హిసాబ్ ఖూన్ కా, ఇలాఖా' చిత్రాల నుంచి పేరు సంపాదించారు నదీమ్ శ్రవణ్లు. మిథున్ చక్రవర్తి తమకు చేసిన సహాయానికి ఇటీవల 10 వేర్వేరు రకాల సంగీతాల బాణీలను సమకూర్చి అవి మిథున్ నటించే చిత్రాలకే సమకూర్చు తాము అని స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ విధంగా మిథున్ రుణం తీర్చుకుంటున్నారు.

Edited Printed and Published by D. Bheem Reddy for Kakatiya Publications, 5-8-55/A, Nampally Station Road, Hyderabad-500 001, Phone: 201181.
Madras Phone: 8252940.